# తెలంగాణ రక్షకుడు కేసీఆర్





- అభివృద్ధిని చూసి ఓటేయండి
- కరీంనగర్‌ను గొప్ప నగరంగా మార్చుతా
- ప్రపంచంలోనే గొప్ప ప్రాజెక్టు మానేరు రివర్ ఫ్రంట్
- బీజేపీ, కాంగ్రెస్ రెండూ ఒక్కటే..
- బ్రహ్మాండమైన మెజార్టీతో గెలుస్తాం
- కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల

కమాన్‌చౌరస్తా: రోడ్డుషోకు భారీగా హాజరైన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి గంగుల

కార్పొరేషన్, నవంబర్ 28 : తెచ్చుకున్న తెలంగాణ రాష్ర్టానికి సీఎం కేసీఆర్ మాత్రమే రక్షకుడుగా నిలుస్తాడని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. తల్లిని చంపి బిడ్డను బతికించారన్న మోదీ రక్షకుడుగా ఉంటారా?.. తెలంగాణ ఉద్యమంలో లేని రేవంత్ రక్షకుడిగా నిలుస్తాడా? అని ప్రశ్నించారు. ఇలాంటి వారని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఎన్నికల ప్రచారం ముగింపులో భాగంగా మంగళవారం నగరంలో భారీ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా టవర్‌సర్కిల్ వద్ద జరిగిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. తనకు మద్దతుగా తరలివచ్చిన ప్రజానీకానికి కృతజ్ఞతలు చెబుతూనే నా చర్మం ఒలిచి చెప్పులు కుట్టించినా మీ రుణం తీర్చుకోలేనని ఉద్వేగానికి లోనయ్యారు. 40 ఏళ్లలో ఎవరూ చేయని అభివృద్ధిని తాను చేసి చూపించానన్నారు. కరీంనగర్‌కు ఎన్ని నిధులు అడిగితే అన్ని నిధులను సీఎం కేసీఆర్ ఇచ్చారని గుర్తు చేశారు. కరీంనగర్‌లో ప్రపంచంలోనే గొప్ప ప్రాజెక్టు అయిన మానేరు రివర్ ఫ్రంట్‌ను తీసుకువచ్చానని, దానిని తానే పూర్తి చేస్తానన్నారు. అలాగే మెడికల్ కళాశాల, వేంకటేశ్వర దేవాలయం, ఇస్కాన్ టెంపుల్‌ను కూడా పూర్తి చేస్తానన్నారు. ఈ అభివృద్ధి పనుల్లో కాంగ్రెస్, బీజేపీ ఏం పాత్ర ఉందని ప్రశ్నించారు. వీరు శిఖండి పాత్ర తప్ప వారు చేసేదేమీ లేదని ఎద్దేవా చేశారు. బీజేపీ నిలబెట్టిన అభ్యర్థే కాంగ్రెస్ అభ్యర్థి అని విమర్శించారు. అందుకే కాంగ్రెస్ అభ్యర్థి నాకా చౌరస్తా దాటి ప్రచారం చేయడం లేదన్నారు. కేవలం ముస్లిం ఓట్లను చీల్చేందుకు మాత్రమే బండి సంజయ్ కాంగ్రెస్ అభ్యర్థితో కుమ్మక్కై కుట్రలు పన్నుతున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే అది బీజేపీకి వేసినట్లేనని తేల్చిచెప్పారు. గతంలో రెండు సార్లు తనపై ఓడిపోయిన బండి సంజయ్ గత ఎంపీ ఎన్నికల్లో దవాఖానలో చేరి గెలిచాడని విమర్శించారు. గెలిచినప్పటి నుంచి అభివృద్ధి కోసం ఒక్క రూపాయి కూడా తీసుకురాలేకపోయారని దుయ్యబట్టారు.

## నగరంలో భారీ ర్యాలీ

కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ తన ఎన్నికల ప్రచారం ముగింపులో భాగంగా మంగళవారం మధ్యాహ్నం నగరంలో భారీ ర్యాలీ తీశారు. నగరంలోని తెలంగాణ చౌక్ నుంచి బస్టాండ్, తెలంగాణతల్లి చౌరస్తా, టవర్‌సర్కిల్ మీదుగా రాజీవ్‌చౌక్ వరకు నిర్వహించారు. ఈ ర్యాలీలో భారీ సంఖ్యలో జనం తరలివచ్చారు. డప్పు చప్పుళ్లు, యువకుల నృత్యాలు కేరింతలతో ఉత్సాహంగా సాగింది.

## స్మార్ట్ సిటీ తీసుకువచ్చానని ప్రమాణం చేస్తావా?

తాను వేంకటేశ్వరస్వామిపై ప్రమాణం చేస్తున్నానని, మరి బండి సంజయ్ స్మార్ట్‌సిటీ తీసుకువచ్చానని ప్రమాణం చేస్తావా? అని మంత్రి గంగుల సవాల్‌చేశారు. 2015లో అప్పటి ఎంపీ వినోద్‌కుమార్, తాను, కార్పొరేటర్లు ఢిల్లీకి పోయి స్మార్ట్‌సిటీ తీసుకువచ్చామని, అప్పుడు సంజయ్ కూడా కార్పొరేటర్ అని గుర్తు చేశారు. మరీ తాను ఎలా స్మార్ట్‌సిటీ తీసుకువచ్చానని చెప్పుకొంటారని ప్రశ్నించారు. అన్నీ దొంగ మాటలతో ప్రజల్ని మభ్యపెడుతున్నారని దుయ్యబట్టారు. నాలుగున్నరేళ్లలో వేల కోట్లు సంపాదించిన సంజయ్ కావాలా?. లంచం తీసుకోని తాను కావాలో ప్రజలు తేల్చుకోవాలని సూచించారు. ఏం వ్యాపారాలు చేసి బండి సంజయ్ వేల కోట్లు సంపాదించారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయమే నీ వ్యాపారమా? అని ప్రశ్నించారు. తన కార్యకర్తల భవిష్యత్తు కోసం ప్రాణత్యాగం చేసేందుకు కూడా సిద్ధమేనని తెలిపారు. తాను ఏ రోజు కూడా లంచాలు, చందాలు తీసుకోలేదన్నారు. నగరాన్ని బ్రహ్మాండంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తానని చెప్పారు. తాము బ్రహ్మాండమైన మెజార్టీతో మరోసారి గెలవబోతున్నామని, నాలుగోసారి గెలిస్తే మరింత మంచి మంత్రి పదవి వస్తుందని, ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసమే పని చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో బీజేపీ వచ్చేది లేదు.. చచ్చేది లేదని, అలాంటి పార్టీలకు ఓటేసి వృథా చేసుకోవద్దని సూచించారు. ప్రచారంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ షమీ, ఎంఐఎం నాయకుడు గులాం అహ్మద్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ అభ్యర్థి గంగులను సన్మానిస్తున్న ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్

# సబ్బండ వర్గాల మద్దతు గంగులకే

- ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్

కలెక్టరేట్, నవంబర్ 28: కరీంనగర్ నియోజకవర్గంలోని సబ్బండ వర్గాల మద్దతు బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్‌కే ఉన్నదని, ముస్లిం సమాజం ఆ పార్టీకి అండగా ఉండి గంగులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంఐఎం నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ కోరారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారం చివరి రోజైన మంగళవారం బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా ఎంఐఎం ఆధ్వర్యంలో మహార్యాలీ నిర్వహించారు. నగరంలోని తెలంగాణ చౌక్‌లో ర్యాలీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, మంత్రి గంగుల కృషితో నగరం స్మార్ట్ సిటీగా రూపాంతరం చెంది, అభివృద్ధిలో హైదరాబాద్‌తో పోటీపడుతున్నదని కొనియాడారు. ఏడు దశాబ్దాల్లో కానరాని పురోగతి కేవలం తొమ్మిదేళ్లలో చేసి చూపారన్నారు. అందుకే మంత్రి గంగులకు ఓటేసి సీఎం కేసీఆర్‌కు బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన అరబిక్ బ్యాండ్ మేళం వాయింపు ఆకట్టుకున్నది. యువకులు, ఎంఐఎం కార్యకర్తలు బ్యాండు మేళానికి అనుగుణంగా కేరింతలు కొడుతూ, నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీలు సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్, అతిఫ్ అతిన, ఖాజ, ఖమ్రుద్దీన్, ఇబ్రహీం, కార్పొరేటర్లు అఖిల్ ఫిరోజ్, షర్ఫుద్దీన్, అలీబాబా, అజర్ దబీర్, నాయకులు అబ్బాష్ షమీ తదితరులు పాల్గొన్నారు.

## గంగులకు జమాత్ ఇస్లామ్ హింద్ మద్దతు

కార్పొరేషన్, నవంబర్ 28: ఈ ఎన్నికల్లో కరీంనగర్‌ను అభివృద్ధి చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్‌కే తమ మద్దతు అని జమాత్ ఇస్లామ్ హింద్ నాయకుడు ఖైరోద్దీన్ తెలిపారు. మంగళవారం స్థానిక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్‌కు పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లోని తమ సంస్థ అన్ని వర్గాలతో చర్చించి ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. కరీంనగర్‌లో గంగుల కమలాకర్‌కు ఓటు వేయాలని సూచించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జమాత్ ఇస్లామి హింద్ నాయకుడు ఖైరోద్దీన్ తదితరులు

# బీఆర్ఎస్‌తోనే మరింత అభివృద్ధి : వినోద్‌కుమార్



కరీంనగర్ మరింత అభివృద్ధి సాధించాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా తెలంగాణమే వినిపిస్తున్నదన్నారు. కాంగ్రెస్‌కు ఓటేసి తమ నోట్లో మట్టికొట్టుకోమని ప్రజలే చెబుతున్నారని తెలిపారు. చెప్పినవన్నీ చేసి చూపించామన్నారు. 24 గంటల కరెంటు అందించామని, గోదావరి, కృష్ణా నదులపై ప్రాజెక్టులు కట్టి కోటి ఎకరాలకు సాగునీరు అందించామన్నారు. లక్షా 60 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, మరో 80 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. కాంగ్రెస్ గురించి ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిదన్నారు. రాష్ట్ర, నియోజకవర్గ అభివృద్ధిపై ఇంగిత జ్ఞానం కూడా లేని వ్యక్తి కాంగ్రెస్ అభ్యర్థి అని మండిపడ్డారు. గత ఎన్నికల్లో సెంటిమెంట్‌తో ఎంపీగా గెలిచిన వ్యక్తి నియోజకవర్గానికి ఒక్క రూపాయి కూడా తేలేదన్నారు. ప్రతిపక్షంలో ఉండి కూడా తాము స్మార్ట్‌సిటీని సాధించామని గుర్తు చేశారు. తాము కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంతోపాటు రాష్ట్రం నుంచి భారీ మొత్తంలో నిధులు తీసుకువస్తామన్నారు. గతంలో ఉమ్మడి కరీంనగర్‌లో ఒక్క ప్రభుత్వ మెడికల్ కళాశాల కూడా లేదని, కానీ ఇప్పుడు నాలుగు మెడికల్ కళాశాలను తీసుకువచ్చామన్నారు. ఎన్నో ఆలోచనలు చేసి, వాటిని అమలు చేయడంలో నిక్కచ్చిగా వ్యవహరించే వ్యక్తి గంగుల అని స్పష్టం చేశారు. మూడోవసారి కేసీఆర్ సీఎం అవుతారని చెప్పారు.

# ఒక్క అవకాశం ఇవ్వండి

- మీ కడుపులో తలపెట్టి అడుగుతున్నా
- సంపుకొంటరో.. సాదుకుంటరో మీ ఇష్టం
- రోడ్‌షోలో బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి భావోద్వేగం

కమలాపూర్, నవంబర్ 28 : 'మీ కడుపులో తలపెట్టి అడుగుతున్నా.. ఒక్క అవకాశం ఇవ్వండి.. సంపుకొంటరో.. సాదుకుంటరో మీ ఇష్టం' అంటూ హుజూరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం కమలాపూర్‌లో భార్య శాలిని, కూతురుతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. సీఎం కేసీఆర్ పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు తీసుకువచ్చారని తెలిపారు. 'మీ దయ అంటున్నా.. మీ దండమంటున్నా.. మీ కడుపులో తలపెట్టి అడుగుతున్నా.. ఒక్కసారి అవకాశం ఇవ్వండి' అంటూ వేడుకున్నారు. దీంతో ఒక్కసారిగా బీఆర్ఎస్ కార్యకర్తలు భావోద్వేగంతో కౌశికన్న కారు గుర్తుకే మన ఓటు అని నినదించారు. అనంతరం ఖాసింపల్లి, మర్రిపెల్లిగూడెం గ్రామాల్లో కౌశిక్‌రెడ్డి భార్య శాలిని ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మహిళలు బతుకమ్మలతో స్వాగతం పలికారు. ఇక్కడ సర్పంచ్ కట్కూరి విజయ, ఎంపీపీ రాణి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

